క్లుప్తంగా

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

శంకర్‌పల్లి: పట్టాదారు పాసుపుస్తకం ఉన్న ప్రతి ఒక్కరూ రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి సురేష్‌బాబు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే వారు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసి ఆయా గ్రామాల పరిధిలోని రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారులను అందించాలని సూచించారు.

అంగన్‌వాడీల పాదయాత్ర



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

షాద్‌నగర్ రూరల్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం షాద్‌నగర్ చౌరస్తా నుంచి లింగారెడ్డిగూడ గ్రామంలోని ఆర్‌డీఓ కార్యాలయం వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డీఓ వెంకట మాధవరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజు, నాయకులు శ్రీనునాయక్, రాజశేఖర్, అంగన్‌వాడీలు జయమ్మ, ఇందిర, ఊర్మిళ, గిరిజ, శారద, మంజుల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయిస్తాం: జెడ్పీటీసీ

షాబాద్: ఎర్రోనిగూడ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేస్తామని షాబాద్ జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎర్రోనిగూడ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో పీఎంజీవై రోడ్డుకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాలేదని తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను వెంటనే బాగు చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, ముద్దెంగూడ ఉప సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, గణేష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

నందిగామ: జంగోనిగూడతో కూడిన అంతిరెడ్డిగూడ పంచాయతీకి నెల రోజుల లోపు ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. అంతిరెడ్డిగూడ గ్రామ పంచాయతీకి ఎన్నికలు నిర్వహించాలని తాము కొన్నేళ్లుగా చేస్తున్న న్యాయ పోరాటంలో చివరకు న్యాయమే గెలిచిందన్నారు. దీంతో తాము ఎంతో కాలంగా చేస్తున్న పోరాటానికి ప్రతిఫలం లభించిందని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

షాద్‌నగర్ రూరల్: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ రాజు కుటుంబ సభ్యులకు సోమవారం గూడ్స్ వెహికల్ యూనియన్ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని కొండన్నగూడ గ్రామానికి చెందిన డ్రైవర్ రాజు కుటుంబ సభ్యులను గూడ్స్ వెహికల్ యూనియన్ సభ్యులు పరామర్శించారు. యూనియన్ తరఫున రూ. 22వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, గణపతి, కన్నా, గౌరీశంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దశదిన కార్యక్రమానికి..

కేశంపేట: మండలంలోని తొమ్మిదిరేకుల గ్రామంలో ఇటీవల చెన్నమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో దశదిన కార్యక్రమ నిమిత్తం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కరుణాకర్‌రెడ్డి రూ. 4వేలు, 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శేఖర్, రాఘవేందర్, నిరంజన్, నర్సింహ, రాంరెడ్డి, మల్లయ్య, బుచ్చిరెడ్డి, సుభాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తెరిచేందుకు అనుమతి ఇవ్వండి

షాద్‌నగర్ రూరల్: పది నెలలుగా మూతపడిన ఆధార్ కేంద్రాన్ని తెరిచేందుకు అనుమతి ఇవ్వాలని నిర్వాహకులు అప్సర్ అధికారులను కోరారు. సోమవారం ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... షాద్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలోని అద్దె భవనంలో మున్సిపల్ కమిషనర్ అనుమతులతో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే ఈ కేంద్రాన్ని పరిశీలించేందుకు వచ్చిన అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసి కేంద్రాన్ని మూసివేయించారని తెలిపారు. వెంటనే కేంద్రాన్ని తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సభ్యుడు పవన్‌చౌహాన్, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్



శంకర్‌పల్లి: దాతలు అందజేసిన కథల పుస్తకాలతో విద్యార్థులు



చేవెళ్ల: కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

షాద్‌నగర్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సభ్యుడు పవన్ చౌహాన్, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ కోరారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట విద్యా సంస్థల బంద్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థులు, యువకులు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడితే తమకు మంచి విద్య లభిస్తుందని, సమస్యలు పరిష్కారం అవుతాయని విద్యార్థి లోకం భావించిందన్నారు. అయితే ప్రత్యేక రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. నాలుగేళ్లుగా స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ సుమారు 4వేల కోట్లు బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడం లేదన్నా రు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని, పుస్తకాలు, స్టేషనరీ వస్తువులను పాఠశాలల్లో అమ్ముతు న్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. అదే విధంగా టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రతి నియోజవర్గానికి ఒక మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న జూనియర్ కళాశాలలు, పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆకాష్ నాయక్, రాధి, శివ నాయక్, విష్ణు, రాము, సాయి, కిషోర్, సంధ్య, వాణి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

కొత్తూరు: చదువుల్లో ఉన్నతంగా రాణిస్తేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఏబీవీపీ మండల కన్వీనర్ నరేష్‌చారి అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సోమవారం ఆయన పలువురు నాయకులతో కలిసి దాతల సాయంతో మండల కేంద్రంలోని కేజీబీవీ హాస్టల్‌కు వంట పాత్రలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం అన్ని రంగాల్లో ఎంతో సాంకేతికత వచ్చిందన్నారు. అందుకు తగ్గట్లుగా విద్యార్థులు కూడా ఓ లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని సాధించేందుకు అహర్నిశలు కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో చదువుకున్న వారికే అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు గ్రహించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని సూచించారు. అప్పుడే విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని వివరించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్‌చారి, భాస్కర్, రవీందర్, కృష్ణ, శ్రీనివాస్, శేఖర్‌గౌడ్, హర్షయాదవ్ పాల్గొన్నారు.

అనుకున్న రంగంలో రాణించాలి

నందిగామ: విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమ శిక్షణతో కూడిన విద్యను అలవర్చుకొని తాము ఇష్టపడే రంగంలో రాణించాలని రోటరీ క్లబ్ చైర్మన్ పూర్ణ చందర్‌రావు సూచించారు. మండలంలోని చేగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా నోటు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత డీఎస్పీ నాగేశ్వర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుంచి ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలని, లక్ష్య సాధనకు నిరంతరం కష్టపడాలని సూచించారు. చదువుకు ధనిక, పేద అనే తేడాలు ఏమీ ఉండవని, ఏక గ్రతతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. రోటరీ క్లబ్ ద్వారా ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, భవిష్యత్తులో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పూర్ణచందర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్య ఎంతో అవసరం

చేవెళ్ల: నేటి సమాజంతో పోటీ పడాలంటే విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని జూనియర్ చాంబర్ ఇంటర్ నేషనల్(జేసీఐ) స్వచ్ఛంద సంస్థ జాతీయ అధ్యక్షుడు కార్తికేయన్ అన్నారు. సోమవారం మండలంలోని గుండాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంస్థ తరఫున 10 కంప్యూటర్లు, ఫర్నీచర్, స్టేషనరీ అందజేశారు. కంప్యూటర్ ల్యాబ్‌ను సంస్థ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు తమ సంస్థ కంప్యూటర్లను అందజేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌జేసీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాజేశ్వర్, జేసీఐ జోన్ అధకచక్షుడు విధిగుప్తా, సరేందర్‌రాజు, పాఠశాల హెచ్ఎం శ్రీలత, ఎస్ఎంసీ చైర్మన్ యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందిస్తే వారు చదువులో రాణిస్తారని రాచమల్ల చెన్నమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సభ్యుడు సిద్ధేశ్వర్ అన్నారు. చేవెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్ లక్ష్మీ, ఉపాధ్యాయులు సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

శంకర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల చదువు కోసం దాతలు సహకరించడం అభినందనీయమని కొండకల్ జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం విద్యాకర్ పేర్కొన్నారు. గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం శేరిగూడ ప్రాథమిక పాఠశాలలో శ్రీ పెంటయ్య జ్ఞాపకార్థం దాతలు వీరమణి, సంతోష్ విద్యా ర్థులకు కథల పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కథల పుస్తకాలు చదివి వాటిలోని సారాంశాలను గ్రహించాలన్నారు. కార్యక్రమంలో శేరిగూడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కృష్ణగౌడ్, ఉపాధ్యాయులు అశోక్, రాముశర్మ, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం పని చేయాలి

చేవెళ్ల: ప్రతి విద్యార్థీ దేశం కోసం పనిచేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మహేశ్ అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేవెళ్లలో సోమవారం జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు.



చేవెళ్ల: విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న సిద్ధేశ్వర్, ఉపాధ్యాయులు



కొత్తూరు: కేజీబీవీ హాస్టల్‌కు వంట పాత్రలు అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు



నందిగామ: విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న పూర్ణచందర్‌రావు

మున్నూరు కాపులు ఏకం కావాలి

చేవెళ్ల: సమస్యల పరిష్కారం కోసం మున్నూరు కాపులు ఏకం కావాలని మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు గుంజరి శ్రీశైలం పిలుపునిచ్చారు. చేవెళ్లలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం మండలంలోని మున్నూరు కాపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపు భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహేందర్, వెంకటేశ్, మాణిక్యం, మాజీ సర్పంచ్ నర్సింలు, నాయకులు దశరథ్, కుమార్, జనార్దన్, జంగయ్య, నర్సింలు, రాఘవేందర్, సతీష్‌బాబు పాల్గొన్నారు. అనంతరం మున్నురుకాపు మండల కమిటీని ఎన్నిక చేశారు. మండల అధ్యక్షుడిగా శ్రీశైలం(చేవెళ్ల), ఉపాధ్యక్షుడిగా తోట చంద్రశేఖర్(ఆలూరు), ప్రధాన కార్యదర్శిగా టి.శ్రీనివాస్(మిర్జాగూడ), కోశాధికారిగా ఎం.మహేందర్(దేవరంపల్లి), సభ్యులుగా కె.వెంకటేశ్, ఎం.వెంకటేశ్, టి.మానిక్యం, పి.సత్తయ్య, సతీష్‌బాబు, రాఘవేందర్ ఎన్నికయ్యారు.

ప్రభుత్వ విధానాలు నచ్చకే కాంగ్రెస్‌లో చేరికలు

షాద్‌నగర్: బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేఖ విధానాలు అవలంబిస్తున్నాయని, అవి నచ్చకే ఆ పార్టీలకు చెందిన నాయకులు మా పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని వెంకన్నగూడ, కొంగగూడ గ్రామాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం కొంగగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ తండాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వెంకన్నగూడ, కొంగగూడ గ్రామ కమిటీ అధ్యక్షులుగా భరత్, రామ్‌సింగ్, ఉపాధ్యక్షులుగా సేవ్యా నాయక్, రాంచందర్, దేవ్, ప్రధాన కార్యదర్శులుగా వినోద్, దేవులా, పిత్యా, రాజును ఎన్నుకున్నారు. పార్టీలో చేరిన వారిలో మోహన్, వెంకటేష్, కృష్ణ, నాగేష్, దేవ్‌సింగ్, గోపాల్, కృష్ణ, బాల్‌రెడ్డి, పీత్యా, రాములు, గోపాల్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు సక్యనాయక్, రవీంద్ర నాయక్, వేణు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు సంప్రదాయాలకు ప్రతీకలు



కేశంపేట: బోనాల ఊరేగింపులో విశాల తదితరులు

స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల

కేశంపేట: పండుగలు మన సంప్రదాయాలకు ప్రతీకలని స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాంద్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పాపిరెడ్డిగూడలో బొడ్రాయి, మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విశాల పూజలు నిర్వహించారు. సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ ప్రణీత్‌రెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, నర్సింలు, శ్రావణ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

మొయినాబాద్ రూరల్: బోనాల ఉత్సవాలను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని సర్పంచ్ చప్పిడి మాణెమ్మ అన్నారు. సోమవారం మండలంలోని ముర్తుజాగూడలో గ్రామ దేవతలు పోచమ్మ, మైసమ్మకు బోనాలతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపం బోనాల పండుగ అని మండల వైస్ ఎంపీపీ జడల లక్ష్మీరాజేందర్‌గౌడ్, సర్పంచ్ సుబ్రమణ్యేశ్వరి అన్నారు. సోమవారం షాబాద్‌లో గ్రామ దేవతలు పోచమ్మ, మైసమ్మలకు ఘనంగా బోనాలు నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో ఎంపీటీసీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్ రూరల్: ముర్తుజాగూడలో..



షాబాద్‌లో బోనాల ఊరేగింపు

హామీల అమలులో సర్కారు విఫలం

కాంగ్రెస్ పార్టీ జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి



మొయినాబాద్ రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న కోదండరెడ్డి



షాద్‌నగర్: సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్

మొయినాబాద్ రూరల్: ఎన్నికల హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని కాంగ్రెస్ పార్టీ జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు జగదీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కనకమామిడి సమీపంలో గల ఓ వ్యవసాయ క్షేత్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో 111 జీవోపై ప్రజాప్రతినిధుల, రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం 2014, 2018 ఎన్నికల్లో 111 జీవోను ఎత్తి వేస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఈ జీవో ఎత్తివేత రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉండదని, తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుందని తెలిపారు. రైతు బంధుతో ధనికులకే లాభం చేకూరుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతులందరికీ న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, జిల్లా అధ్యక్షుడు చెల్లా నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు మానయ్య, నాయకులు సత్యనారాయణ, వసంతం, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, జైపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీరామ్‌నగర్ జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో దళితులకు అన్యాయం

షాద్‌నగర్: బీఆర్ఎస్ హయాంలో దళితులకు తీరని అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక దళితులు పూర్తిగా వెనుకబాటుకు గురవుతున్నారని అన్నారు. దళితుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన దళిత బంధు పథకం ఫలాలను బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే అందుతున్నాయని అన్నారు. తద్వారా అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పథకం నిధులను సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు తరలించారని ఆరోపించారు. నాయకులు బాబర్ ఖాన్, బాల్‌రాజ్ గౌడ్, రఘు, నెహ్రూ, కిరణ్ పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

కొందుర్గు: తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం కొందుర్గు మండలం చెర్కుపల్లిలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు న్యాయం జరిగిందన్నారు. ఇప్పటికీ ఇందిరమ్మ ఇళ్లు మాత్రమే ఉన్నాయన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఏమయ్యాయని సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు వజ్రమ్మ, పర్వతా పూర్ ఎంపీటీసీ మంజు, నాయకులు యాదయ్య, నర్సింలు, రాజు, రాములు, కృష్ణయ్య పాల్గొన్నారు.

బంగారు తెలంగాణ ఏదీ?

మొయినాబాద్ రూరల్: సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు నిరసన తెలుపుతున్నా సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదని, బంగారు తెలంగాణ అంటే ఇదేనా అని జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్ ఎద్దేవా చేశారు. మండలం పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులకు సంఘీభావం తెలిపారు.

కాంగ్రెస్ బలోపేతం

చేవెళ్ల: గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని న్యాలట గ్రామ కమిటీని ఎంపిక చేసి నూతన సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి, పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. న్యాలట గ్రామ అధ్యక్షుడిగా వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా శేఖర్, సరేందర్, ప్రధాన కార్యదర్శిగా ఎల్లయ్య, కార్యదర్శులుగా శివకుమార్, సీహెచ్ శ్రీనివాస్, పద్మరావు, శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడిగా మల్లేశ్, మహేందర్, చెంద్రయ్య, నాగేశ్, సలహాదారులుగా పి.పెద్ద బాలయ్య, మాజీ సర్పంచ్ బుచ్చయ్య, పాండయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, జి.మల్లేశ్, పర్మయ్య, సాయన్న, యాదయ్య, రాంచంద్రయ్యను ఎన్నుకున్నారు.

డిమాండ్లు నెరవేర్చేదాకా పోరాటం ఆగదు



షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

షాద్‌నగర్: గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేదాకా పోరాటం ఆగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు స్పష్టం చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద జీపీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టి మూడు రోజులు అవుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. అనంతరం ఫరూఖ్‌నగర్ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ నాయక్, కార్మికులు మాసయ్య, సురేష్, యాదయ్య, జంగమ్మ, కిష్టయ్య, చంద్రమ్మ, కమలమ్మ, భాగ్యమ్మ, రాజు, జంగయ్య, నర్సింలు, సిద్దమ్మ, మోహన్, రవి, పార్వతమ్మ, లక్ష్మమ్మ, మైసమ్మ, మాణిక్యం, పద్మమ్మ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులవి న్యాయమైన కోర్కెలే

మొయినాబాద్ రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులవి న్యాయమైన కోర్కెలే అని, వాటిని వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 5వ రోజుకు చేరింది. పంచాయతీ కార్మికులకు ప్రవీణ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సదుపాయం కల్పించాలన్నారు. అలాగే 51 జీవోను రద్దు చేయాలన్నారు. పంచా యతీ కార్మికుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కార్మికులు సుధాకర్, నర్సింహ, ప్రవీణ్, లక్ష్మి, కృష్ణ, సత్తయ్య, రాంచంద్రి పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

కొందుర్గు: పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య డిమాండ్ చేశారు. జిల్లేడ్ చౌదరిగూడలో సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు న్యాయబద్ధంగా సమ్మె చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, లక్ష్మయ్య, జంగయ్య, పాపయ్య, ఈదమ్మ, జంట్లీ, అంజమ్మ, రాజు, కిష్టయ్య, రత్నయ్య పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతు

షాబాద్: పట్టణంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం కూడా కొనసాగింది. సమ్మెకు తెలంగాణ ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోల్ నర్సింహులు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ గ్రామ పంచాయతీల కార్మిక సంఘం మండల అధ్యక్షుడు భీమయ్య, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

కేశంపేట: డిమాండ్ల సాధన కోసం గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సోమవారం కేశంపేటలో పంచాయతీ కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు రాంచంద్రయ్య, పారేష, యాదయ్య, జంగయ్య, అంజయ్య, చంద్రయ్య, భిక్షమయ్య, రాములు, పద్మమ్మ, నర్సమ్మ, పెంటమ్మ, స్వరూప, యాదమ్మ పాల్గొన్నారు.

'కార్మిక సమస్యలు పరిష్కరించాలి'

మొయినాబాద్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మొయినాబాద్‌లో సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, పంచాయతీ కార్మికులను ఆయన కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వొద్దని.. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులతోనే వంట చేయించాలన్నారు. వారికి రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, గుడ్డుకు అదనంగా డబ్బులు ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచడంతోపాటు సకాలంలో వేతనాలు అందజేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు పెంటారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.